పొంచి ఉన్న పెనుముప్పు

పుత్తూరు పట్టణ ప్రజలకు ఎస్ఎస్ ట్యాంకు రూపంలో ప్రమాదం పొంచి ఉంది. 2021 మే 18వ తేదీన ట్యాంకు కట్ట 200 మీటర్ల మేరకు కుంగింది. దీనిపై స్పందించిన ఆనాటి ఎమ్మెల్యే ఆర్కే రోజా జిల్లా అధికారులను అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి పుత్తూరు ప్రజల ప్రాణాలను కాపాడారు. పూర్తి స్థాయి మరమ్మతుల కోసం నాటి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసింది. అయితే ఆనాటి కరోనా పరిస్థితుల నేపథ్యంలో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా టెండర్లు పిలిచి చేతులు దులుపుకొన్నారే గానీ పనులు ప్రారంభించలేదు. దీంతో పట్టణ ప్రజలు ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని కంటిమీద కునుకు లేకుండా ఉన్నారు.

- బలహీనంగా ఎస్ఎస్ ట్యాంకు కట్ట
- కట్ట కుంగి నాలుగేళ్లు పూర్తి
- వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో మరమ్మతులకు రూ.9 కోట్లు మంజూరు
- టెండర్లతో సరిపెట్టిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం



కుంగిన పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు కట్ట (ఫైల్)



పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు

పుత్తూరు: ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2006లో పుత్తూరు చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.55 కోట్లు మంజూరు చేశారు. చెరువు మొత్తం విస్తీర్ణం 145 ఎకరాలు కాగా అందులో 90 ఎకరాల్లో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. మిగిలిన 55 ఎకరాలను ట్యాంకు చుట్టూ చెరువుగా వదలిపెట్టారు. అయితే నాలుగేళ్ల పాటు జరిగిన ట్యాంకు నిర్మాణ పనుల్లో నాణ్యత ఏమాత్రం లేదంటూ అప్పట్లోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. అయినా 2010 నాటికి పనులు పూర్తయ్యాయనిపించారు. రూ.55 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ట్యాంకును మాత్రం అధికారికంగా ప్రారంభించలేదు. పైగా పదేళ్ల పాటు ట్యాంకును నీటితో నింపలేదు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం 2020లో ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో చెరువు నీటిని ట్యాంకులోకి పంపింగ్ చేయించారు. ట్యాంకు వాటర్ కెపాసిటీ 2400 ఎంఎల్‌డీలు కాగా 1440 ఎంఎల్‌డీల నీటితో ట్యాంకును నింపారు. ఇంకా 960 ఎంఎల్‌డీల నీటిని నింపే సామర్థ్యం ఉన్నా 2021 మే 18వ తేదీన ట్యాంకు కట్ట 10 అడుగుల లోతుతో 200 మీటర్ల మేరకు కుంగిపోయింది. ట్యాంక్‌లోకి నీరు చేరి ఏడాది తిరక్క ముందే కట్ట కుంగిపోవడంపై పుత్తూరు పట్టణ ప్రజలు విస్మయానికి గురయ్యారు. ట్యాంకులో 60 శాతం నీరు నిల్వ ఉన్న సమయంలో గండి పడితే పుత్తూరు పట్టణంతోపాటు, పక్కనే ఉన్న ఈశ్వరాపురం గ్రామం సైతం ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే ఆనాటి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా వెంటనే స్పందించి జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి, నీటి ముప్పు నుంచి ప్రజలను రక్షించారు. ట్యాంకు నిర్మాణం నాసిరకంగా జరుగుతోందని, వర్కులో అవినీతి రాజ్య మేలుతోందని ఆనాటి ఆరోపణలకు కట్ట కుంగడం అద్దం పడుతోందని విమర్శించారు. ట్యాంకు నిర్మాణ కాంట్రాక్టర్ నుంచే నష్ట పరిహారం వసూలు చేయాలంటూ ఆమె డిమాండ్ చేశారు.

కట్ట కుంగడానికి ప్రచారంలోని కారణాలు

- ట్యాంకు నిర్మాణ పనులు పూర్తిగా నాసిరకంగా చేపట్టడం.
- ట్యాంకు నిర్మాణం పూర్తయ్యి పదేళ్లు అయినా నీటితో నింపకపోవడం.
- ట్యాంకు పర్యవేక్షణను ఏమాత్రం పట్టించుకోకపోవడం.
- ట్యాంకు సమీపంలోని గ్రానైట్ క్వారీలలో యథేచ్ఛగా పేలుళ్లు

విచారణకు ఆదేశాలు

కట్ట కుంగిపోవడానికి గల కారణాలతోపాటు నిర్మాణ పనులపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని నాటి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం నిపుణులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులు కట్టను పరిశీలించి మట్టి నమూనాలు సేకరించారు. పరీక్షల అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. నిర్మాణం పూర్తయిన పదేళ్లపాటు ట్యాంకును ఖాళీగా ఉంచడం, మొత్తం మీద కట్ట నాసిరకంగా నిర్మించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై ట్యాంకు నిర్మాణ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ముందుకు వచ్చింది. అయితే ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయి మరమ్మతుల కోసం రూ.9 కోట్లు మంజూరు చేశారు.

స్వర్ణముఖి నీరు వస్తే ఏం చేస్తారు?

2006లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టగా దానికి కొనసాగింపుగా 2019లో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే పుత్తూరుకు తాగునీటి పైపులైను పనుల కోసం ఏఐఐబీ ద్వారా రూ.139 కోట్లు మంజూరు చేసింది. దీంతో సోమశిల–స్వర్ణముఖి కెనాల్ ద్వారా కేవీబీపురం నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు వరకు 58 కిలోమీటర్ల డీఐ పైపులైన్ పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వంలోనే 40 కిలోమీటర్ల మేరకు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేసి నీళ్లు ట్యాంకులోకి వదలాలంటే ట్యాంకు కట్ట బలహీనంగా ఉంది. పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టకుండా నీటితో ట్యాంకును నింపితే ప్రమాదాన్ని కొనితెచ్చుకొన్నట్లే. దీంతో తప్పనిసరిగా ఎస్ఎస్ ట్యాంకు మరమ్మత్తుల పనులు విధిగా పూర్తి చేయాల్సి ఉంది.



కుంగిన చోట బలహీనంగా ఉన్న కట్ట



కట్టపైనే ఏపుగా పెరిగిపోతున్న ముళ్లపొదలు

అడ్మినిస్ట్రేషన్ అప్రూవల్‌కు పంపించాం

పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు పూర్తి స్థాయి మరమ్మతుల కోసం రూ.9 కోట్లకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అడ్మినిస్ట్రేషన్ అప్రూవల్ కోసం తాడేపల్లిలోని ఇంజినీరింగ్ ఇన్ చీఫ్(ఇ–ఇన్–సి) కార్యాలయానికి పంపించాం. అక్కడి నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– సుబ్బారాయుడు, ఈఈ, పబ్లిక్ అండ్ హెల్త్, తిరుపతి

క్లుప్తంగా

ఘనంగా పౌర్ణమి పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నిండ్ర: మండలంలోని కేఆర్‌పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనారాయణ మహాహోమం నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారి తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా జాతర



పాతగుంటలో అమ్మవారికి పట్టు వస్త్రాల ఊరేగింపు

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంట గ్రామంలో మంగళవారం కరికమాని గంగమ్మ ఆలయంలో అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అమ్మవారికి అంబలి పోసి, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. తదుపరి వైఎస్ఆర్ సీపీ మండల కార్యదర్శి బొజ్జారెడ్డి, పాతగుంట సర్పంచ్ భువనేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఎనమలమంద ఎస్సీ కాలనీ, గెరిగదొన, దామరకుప్పం గ్రామాలలో జాతర ఉత్సవాలు మిన్నంటాయి. పెద్ద ఎత్తున గ్రామాల్లో బాణసంచా కాల్చి సందడి చేశారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

అలరించిన హరికథా గానం



వేపంజేరిలో హరికథా గానం చేస్తున్న కళాకారులు

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో జరుగుతున్న మహాభారత మహోత్సవంలో భాగంగా మంగళవారం హరికథ కాలక్షేపం పలువురిని అలరించింది. తిరుపతికి చెందిన హరికథ భాగవతారిణి పూర్ణ, కీబోర్డ్ కిరణ్, తబలా మురళీకృష్ణ బృందం 18 రోజులుగా వేపంజేరి గ్రామంలో మహాభారత మహోత్సవం సందర్భంగా హరికథా కాలక్షేపం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం దుర్యోధన వధ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సాంబశివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సర్పంచ్ వాసుదేవరెడ్డి, పెద్దిరెడ్డి, మాజీ ధర్మకర్త మురుగేష్ రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎంవీఐ

నగరి: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన వాహనాలను మంగళవారం ఎంవీఐ వాసుదేవరెడ్డి తనిఖీ చేశారు. ప్రతి వాహనంలో టైర్లు సరిగా ఉన్నాయా, లోపల సీట్లు సక్రమంగా ఉన్నాయా, విద్యార్థులకు హాని కలిగించే అంశాలను పరిశీలించారు. అలాగే వాహన డ్రైవర్ల లైసెన్స్‌లు పరిశీలించారు. అన్ని పరిశీలించిన తరువాత వారికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేశారు.

శిక్షణ అంశాలను తప్పక పాటించాలి

నగరి: కిశోరి వికాసం శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పక పాటించాలని సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని కాకవేడు దళితవాడ, ఏకాంబరకుప్పంలలో కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఫోక్సో చట్టం, నైపుణ్యాలు, లీడర్‌షిప్, ఆర్థిక నిర్వహణ, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. నేర్చుకున్న అంశాలను తప్పక పాటించాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

వైభవంగా మహాభారత ఉత్సవాలు



ఊరేగుతున్న ద్రౌపదీ అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి కల్యాణం కనులవిందుగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథ కాలక్షేపం జరిగింది. ఆలయం ఆవరణలో పెళ్లి పందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధ పరిమళాలు వెదజల్లే మాలికలతో ముస్తాబు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. అమ్మవారు గ్రామ వీధుల్లో ఊరేగి, భక్తులను కటాక్షించారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఊరేగింపులో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పిచ్చయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేతలు

వెదురుకుప్పం: మండలంలోని ధర్మాచెరువు గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సుకుమార్ తండ్రి పిచ్చయ్య ప్రథమ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి కార్యక్రమానికి హాజరయ్యారు. పిచ్చయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు గోవిందన్, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, మాజీ యువత అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, బూత్ కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, విద్యా విభాగం అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు మురళీ, అనిల్ ఉన్నారు.

తవ్వేశారు.. పూడ్చేది మరిచారు

– వారం రోజులుగా ప్రయాణికులకు తప్పని ఇబ్బంది



మండపం వీధిలో తవ్వి, వదిలేసిన గొయ్యి

కార్వేటినగరం: అసలే కార్వేటినగరంలో ట్రాఫిక్‌తో ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకైన రోడ్లు, రోడ్డుపైనే ఆటోలు, వాహనాలు, ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో జనం అవస్థలు పడుతున్నారు. ఇంత రద్దీగా ఉండే మండపం వీధిలో 10 రోజుల క్రితం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట మరమ్మతుల కోసం హడావిడిగా పెద్ద గొయ్యిను తవ్వారు. ఏమైందో కానీ గొయ్యిని పూడ్చడం మరిచి పోవడంతో ట్రాఫిక్ అంతరాయం మరింత జఠిలంగా మారింది. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే చాలు ఒక్క ద్విచక్ర వాహనం కూడా కదల్లేని పరిస్థితి నెలకొంది. దీంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదుపు తప్పి గోతిలో పడితే ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం స్థానికులను పట్టి పీడిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి తీసిన గోతిని పూడ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక దందాపై చర్యలు తీసుకోండి



తహశీల్దార్ కార్యాలయం కొట్రకోన గ్రామస్తులు

గంగాధరనెల్లూరు: ఆంధ్ర రాష్ట్రంలో ఇసుక ఉచితమే కానీ కూటమి నాయకులకు కప్పం కట్టాల్సిందేనని, వారి తీరుపై కొట్రకోన గ్రామస్తులు సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. గంగాధరనెల్లూరు మండలంలోని నీవా నది పరివాహక ప్రాంతమైన కొట్రకోన గ్రామంలో ఇసుక రవాణా జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి ఇసుక ఉచితమైనా కొందరు సొమ్ము చేసుకోవడానికి మాత్రం దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. నీవా నది నుంచి ఇసుక తీసుకురావాలంటే ఒక్కో ట్రాక్టర్‌కు రూ.100 వసూలు చేస్తూ దౌర్జన్యంగా లక్షలు గడిస్తున్నారు. సదరు సమస్యపై జిల్లా అధికారుల చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాల్సిందిగా కొట్రకోన గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు.

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె నోటీసు



కమిషనర్‌కి సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

పుత్తూరు: నగర, పురపాలక సంఘాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22 నుంచి సమ్మెబాట పడుతున్నట్లు ప్రకటించాయి. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పుత్తూరు మున్సిపల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో కమిషనర్ మంజునాథగౌడ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. గణేష్‌కుమార్ మాట్లాడుతూ గత కొంత కాలంగా సమస్యలు పరిష్కరించమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని యూనియన్లు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. సమ్మె నోటీసు కాల వ్యవధి ఈ నెల 21వ తేదీన ముగుస్తుందని, 22 నుంచి అన్ని యూనియన్ల వర్కర్లు సమ్మెబాట పడుతామని హెచ్చరించారు. తమ సమ్మె కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తాము కోరుతున్నట్లు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులకు టెక్నికల్ జీతం కింద నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ కింద రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు, రూ.10 పింఛన్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు, మెడికల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె తప్పదని హెచ్చరించారు.

పాడి పశువులకు వైద్యసేవలు

నిండ్ర: పశువులకు టీకాలు ద్వారా ప్రతి గ్రామంలో పాడి రైతులు తమ పశువులకు వైద్యసేవలు పొందాలని అరూరు పశు ఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్ వర్మ అన్నారు. మండలంలోని ఓబులరాజుకండ్రిగలో గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరంలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయడంతో పశువులకు వివిధ రోగాలను నయం చేయవచ్చునని అన్నారు. అదేవిధంగా వివిధ రోగాలను అరికట్టేందుకు పాడి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

నిండ్ర: క్షయ రహిత సమాజమే మన లక్ష్యంగా తయారు చేయాలని వైద్యాధికారి సుమలత అన్నారు. మంగళవారం వైద్యశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిని అంతం చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. చాలా రోజులు దగ్గు వస్తుంటే పరీక్షలు చేసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఏఎన్ఎంలు అవగాహన కల్పించాలని కోరారు. వైద్యాధికారి వినీషా, హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌ఓ శ్రీదేవి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

నిండ్ర: మండలంలోని రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నిండ్రలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి, కావాల్సిన పోషకాలను వాడాలని అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్షంపై కమలాకాంతుడు

– రాజమన్నార్‌గా శ్రీవారి దర్శనం



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



కల్పవృక్షంపై రాజమన్నార్‌గా శ్రీవారి దర్శనం

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంగా ఉన్న సుప్రసిద్ధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడు శ్రీరాజమన్నార్ అలంకరణలో కల్పవృక్షంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. 8 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 9.30–11గంటల మధ్య స్నపన తిరుమంజనం నిర్వహించారు.

కల్యాణం..కమనీయం

సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపైకి వేంచేపు చేశారు. 4.30 నుంచి 6.30 వరకు అశేష భక్తుల గోవింద నామస్మరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతంగా సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహన సేవ ఆలయానికి చేరుకున్న అనంతరం ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు పల్లకిలో మోహినీ ఉత్సవం, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ ఉంటుంది. రాత్రి 7.30 నుంచి 9 వరకు గరుడ వాహనంపై స్వామివారు విహరిస్తారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గంగాధరనెల్లూరు: మండలంలోని ఎల్లమరాజుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులలో భాగంగా నాలుగు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ సురేష్‌కుమార్, వరదరాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎల్లమరాజుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈనెల 11నుండి 14 వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలోని ఎల్లమ్మరాజు పల్లె, ఠాణా, చెర్లోపల్లె, చెర్లోపల్లి దళితవాడ, పి.బి.అగ్రహారం, వేల్కూరు, చిత్తూరు మండలంలో ఎగువ మాసాపల్లె, శెట్టిగారిపల్లె, కొత్తూరు, బంగారెడ్డిపల్లె గ్రామా ల్లో నాలుగు రోజులపాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని వారు తెలిపారు.